క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ముత్యాలరాజు



కమిషనర్‌కు అప్పన్న చిత్రపటాన్ని అందిస్తున్న సూపరింటెండెంట్ త్రిమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ముత్యాలరాజు సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాన్ని పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు అందించారు.

రౌడీ షీటర్లపై నిరంతర నిఘా



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని రౌడీ షీటర్లను హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన తమ తమ కుటుంబాలు సమాజంలో చిన్న చూపునకు గురవుతాయన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని పేర్కొన్నారు. పలు సూచనలు చేశారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సిటు నాయకులు

సింహాచలం: తొలిగించిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిటు డిమాండ్ చేసింది. సింహాచలంలో ఆదివారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గోపాలపట్నం సిటు ప్రధాన కార్యదర్శి పి.అనసూయ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించడం అన్యాయమని, వెంటనే విధుల్లోకి తీసుకో వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మె డిమాండ్ల పరిష్కారానికి సీఎం జోక్యం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిటు జోన్ అధ్యక్షుడు ఎం.ప్రసాద్, సింహాచలం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.రామనాయుడు, సభ్యులు వెంకటరావు, అప్పారావు, నర్సింహులు పాల్గొన్నారు.

రేషన్ డిపో ప్రారంభం



రేషన్ డిపోను ప్రారంభిస్తున్న వెన్నలపాలెం సర్పంచ్ అప్పారావు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ డిపోను స్థానిక సర్పంచ్ వెన్నల అప్పారావు(వైఎస్సార్ సీపీ) ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి కూటమి నాయకులు గైర్హాజరయ్యారు. సర్పంచ్ అప్పారావు రేషన్ డిపోను ప్రారంభించడం సహించలేని కూటమి నాయకులు అక్కడికి చేరుకుని డిపోను తాత్కాలికంగా మూసివేయించారు. వారి ఆధ్వర్యంలో సోమవారం డిపోను మళ్లీ తెరవడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆదివారంనాటి కార్యక్రమంలో వీఆర్వో కమల, వైఎస్సార్‌సీపీ నాయకులు పైల సత్తిబాబు, వెన్నల సింహాద్రి, పైల రేగారావు, కటారి సన్యాసినాయుడు, పి.సన్యాసిరావు, బండారు నాయుడు, పైల మణి, వై.ప్రమీల, వెన్నల అయ్యబాబు, సూరిబాబు, గుల్లి అయ్యబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



శిబిరంలో విద్యార్థులతో రిసోర్స్ పర్సన్లు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, ఆటలు, పాటలను నేర్పించారు. విద్యార్థులు తమదైన శైలిలో ప్రదర్శన కనబరిచారు. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, రిసోర్స్ పర్సన్లు కేఎస్ఆర్ మూర్తి, సీహెచ్ఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

దుర్గంధం నుంచి విముక్తి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ నిధులతో నిర్మించిన సీసీఎస్ యూనిట్



జోన్-8 పరిధిలో సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు గల్లాలోకి వేసి రసాయనిక చర్య చేస్తున్న సిబ్బంది

- క్లోజ్డ్ కాంపాక్ట్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్(సీసీఎస్)తో ప్రజలకు ఊరట
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.11.22 కోట్లతో నిర్మించిన జీవీఎంసీ
- రోజూ చీమలాపల్లి సీసీఎస్ నుంచి కాపులుప్పాడకు 180 టన్నుల చెత్త

భరించలేని దుర్గంధం. విపరీతమైన దోమలు, ఈగలు. వాటి కారణంగా రోగాలు. భోజనం చేద్దామంటే దుర్వాసనకు ముద్ద దిగని దుస్థితి. ఇదీ కొన్నాళ్ల క్రితం వరకు వేపగుంట ప్రాంతంలోని చీమలాపల్లి, వరలక్ష్మినగర్, వాటి సమీప కాలనీవాసుల పరిస్థితి. ఆరుబయట డంపింగ్‌యార్డుతో ఈ ప్రాంతవాసుల బాధలు వర్ణనాతీతం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీరి ఇక్కట్లకు చెక్ పడింది. ఇక్కడ క్లోజ్డ్ కాంపాక్ట్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (సీసీఎస్) నిర్మాణానికి జీవీఎంసీ ద్వారా రూ.11.22 కోట్లు కేటాయించింది. వాటి ఫలితం ప్రస్తుతం ఇక్కడి ప్రజల ప్రశాంత జీవనం.

పెందుర్తి: మండలంలోని జీవీఎంసీ పరిధి గ్రామాల చెత్తంతా.. చీమలాపల్లి ముంగింట్లోనే పోగయ్యేది. ఇక్కడి డంపింగ్‌యార్డే ఇందుకు కారణం. దీంతో చీమలాపల్లితోపాటు వరలక్ష్మినగర్, సమీప కాలనీవాసుల ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. దాన్ని అక్కడి నుంచి తరలించాలని వందలసార్లు వినతులు.. మరెన్నో ఆందోళనలు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చేంత వరకు వీరి ఆవేదన, ఆందోళనలు కొనసాగుతూనే ఉండేవి. అంతకు ముందున్న టీడీపీ పాలనలో హామీలిచ్చారే తప్ప.. అమలుకు కనీస చర్యలు తీసుకోలేదు.

ఆ‘వేదన’చెప్పలేనిది?

జీవీఎంసీ జోన్-8 పరిధిలోని వందలాది కాలనీల్లో సేకరించిన చెత్తనంతా జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి సమీపంలోని ఆరు బయలు డంపింగ్ యార్డులో వేసేవారు. దీంతో చెత్త కుళ్లిపోయి విపరీతమైన దుర్గంధం వెదజల్లేది. దీంతోపాటు దోమలు, ఈగలు వృద్ధి చెంది, స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడేవారు. కుటుంబంలో ఎవరో ఒకరు తరచూ రోగాలకు గురయ్యేవారు. కనిపించిన ప్రతి అధికారికి, పాలకులకూ స్థానికులు మొరపెట్టుకునేవారు. వారి ఆవేదనను ఎవరూ పట్టించుకోలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి జీవీఎంసీ పాలకవర్గం కొలువుదీరగానే దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇక్కడి పరిస్థితిని అప్పటి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఉన్నతాధికారులు పరిశీలించారు. పరిస్థితిని స్వయంగా తెలుసుకుని, ఆధునిక డంపింగ్ యార్డు నిర్మాణానికి సంకల్పించారు.



గతంలో చీమలాపల్లి వద్ద ఆరు బయట వేసిన చెత్త(ఫైల్)

రూ.11.22 కోట్లతో నిర్మాణం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఇక్కడి డంపింగ్ యార్డుపై దృష్టి సారించింది. వాస్తవంగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన(2019) వెంటనే సీసీఎస్ నిర్మాణానికి శంకుస్థాపన చేయాలనుకున్నారు. కోవిడ్ కారణంగా వాయిదాపడి 2022లో సీసీఎస్ నిర్మాణానికి జీవీఎంసీ పూనుకుంది. వెంటనే రూ.11.22 కోట్లు నిధులు విడుదల చేసి నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు దుర్గంధం నుంచి విముక్తి లభించింది. జోన్-8 పరిధిలో రోజూ సేకరించే దాదాపు 180 టన్నుల పొడి, తడి చెత్తను రసాయనిక చర్యల అనంతరం కాపులుప్పాడకు తరలిస్తున్నారు.

తొలగిన ఇబ్బందులు

ఈ ఆధునిక డంపింగ్ యార్డులో రెండు భారీ గల్లాలు ఏర్పాటు చేశారు. ఆయా గల్లాల్లోకి జీవీఎంసీ చెత్త వాహనాల ద్వారా తీసుకువచ్చిన తడి, పొడి చెత్తను నేరుగా వేస్తారు. ఇక్కడ రసాయన ప్రక్రియ వలన చెత్త నుంచి ఎలాంటి దుర్వాసన రాదు. సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు నగరంలోని కాపులుప్పాడలో ఉన్న జీవీఎంసీ ప్రధాన డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. ఆరుబయలు డంపింగ్ లేకపోవడంతో దోమలు, ఈగల వ్యాప్తి ఉండదు. ఈ యూనిట్‌ను ఏర్పాటుతో స్థానిక ప్రజలకు ఎటువంటి కాలుష్యం, దుర్వాసన, ఇతర అనారోగ్యాలు తలెత్తే పరిస్థితి లేకుండా పోయింది.

ఎంతో ఊరట కలిగింది



గతంలో ఇక్కడ ఆరుబయట డంపింగ్ యార్డుతో చాలాకాలం పాటు తీవ్ర అవస్థలు పడ్డాం. అక్కడి నుంచి వచ్చే దుర్వాసన, దోమలు, ఈగలతో తరచూ అనారోగ్యం పాలయ్యేవాళ్లం. కానీ ఇప్పుడు కొత్తగా సీసీజీటీఎస్ యూనిట్ ఏర్పాటుతో ఆ పరిస్థితి లేదు. ఇప్పుడు మాకు ఎంతో ఊరటగా ఉంది. –ఆర్.లక్ష్మి, చీమలాపల్లి

అవస్థలు తప్పాయి



ఆరు బయట డంపింగ్‌యార్డు రోజులు గుర్తుకొస్తే.. అమ్మో.. ఆ దుర్వాసనతో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. తిండి కూడా సహించేది కాదు. ఎప్పుడూ ఇంట్లో ఎవరో ఒకరికి ఏదో ఒక అనారోగ్యం. ఈ యార్డు నిర్మాణంతో ఎంతో మేలు జరిగింది. ఏడాది కాలంగా దుర్గంధం అవస్థలు తప్పాయి.

–కుప్పిలి భాగ్యలక్ష్మి, వరలక్ష్మినగర్, వేపగుంట

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పరవాడ: స్థానిక మండల పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు చెప్పారు. సమావేశానికి పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ ఉంటుందన్నారు. పార్టీ ముఖ్యనాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ



సత్తెమ్మకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత, శ్రీనివాసనగర్ ప్రజల ఆరాధ్యదేవత సత్తెమ్మతల్లి పండగ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున అర్చకులు అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, ఆరాధన నిర్వహించారు. విశేష పూజలు జరిపిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా ఆలయానికి, అమ్మవారికి విశేష అలంకారం చేశారు. భక్తులకు మజ్జిగ, మంచినీరు, ప్రసాద వితరణ జరిపారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్పొరేటర్లు రాపర్తి కన్నా, పి.వి.నరసింహం తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

10న పైడితల్లి అమ్మవారి పండగ



పండగ తేదీని ఖరారు చేస్తూ దేవస్థానం ఏఈవోకు లేఖ అందిస్తున్న లండ వెంకటరమణ, గ్రామస్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ ఈ నెల 10న జరగనుంది. సింహాచలం కొండదిగువ శ్రీనృసింహ సదనంలో పండగ నిర్వహణపై అడవివరం గ్రామ పెద్దలు, పైడితల్లి అమ్మవారి పూజారి వంశీయులు, ఉత్సవ కమిటీ నాయకులతో సింహాచలం దేవస్థానం అధికారులు ఆదివారం సమావేశమయ్యారు. అమ్మవారి పండగ నిర్వహణ తేదీని అమ్మవారి వ్యవస్థాపక పూజారి కుటుంబ సభ్యుడు లండ వెంకటరమణ ప్రకటించారు. ఈ నెల 2న పైడితల్లి దేవర(పుట్టమన్ను), ముత్యాలమ్మ దేవర(పుట్టమన్ను)ను తెచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 3న ముత్యాలమ్మ పండగ, 9న పైడితల్లి పండగ తొలేళ్ల మహోత్సవం, 10న పండగ మహోత్సవం, 17న మారువారం పండగను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేవస్థానం చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. 9న జరిగే తొలేళ్ల ఉత్సవానికి సంబంధించి దేవస్థానం ఏర్పాటుచేసే సాంస్కృతిక కార్యక్రమం పెద్ద ఎత్తున ఉండాలన్నారు. అమ్మవారి ఆలయానికి సాయినగర్‌లో భూమిని కాపాడాలని, అమ్మవారికి భక్తులకు సమర్పించే బంగారం, వెండి వివరాలను దేవస్థానం బహిర్గతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థానం ఏఈవో ఆనంద్ మాట్లాడుతూ పండగ నిర్వహణపై గ్రామస్తులు కోరిన ప్రతి అంశానికి దేవస్థానం నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదన్నారు. బంగారమ్మ ఆలయానికి ప్రహరీ నిర్మానానికి అంచనాలు రూపొందించామని, త్వరలోనే నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఈఈ రాంబాబు, కార్పొరేటర్లు పీవీ నరసింహం, వైఎస్సార్ సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం

‘వెన్నుపోటు దినం’ పోస్టర్ ఆవిష్కరణలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్



పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తదితరులు

సబ్బవరం: అధికార పక్షం చేస్తున్న ప్రతి ఒక్క ప్రజావ్యతిరేక కార్యక్రమంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా, పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఈ నెల 4న పెందుర్తిలో నిర్వహించే వెన్నుపోటు దినం గోడపత్రికను సబ్బవరంలోని పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చి ఏడాది అవుతున్నా.. ఏం చేశారో చెప్పుకోలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. దివంగత మహానేత వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిలు తామిచ్చిన హామీలతోపాటు, ప్రజలకు మరింత మేలు చేయాలనే సంకల్పంతో పనిచేస్తే, ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని చూస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినంగా భావిస్తూ పెద్దఎత్తున ప్రజలతో కలిసి ప్రభుత్వ మోసాన్ని ఎండగట్టనున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలపై కూటమిలోని ముగ్గురు నేతలు సీఎం, డీసీఎం, సీఎం తనయుడు వేర్వేరుగా మాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. పింఛన్లు మాత్రం పెంచామని చెప్పుకుంటూ.. లక్షల మందికి పింఛన్లు తొలిగించే కార్యక్రమం జరుగుతోందన్నారు. 4న పెందుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరాం, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొటాన రాము, పెందుర్తి జెడ్పీటీసీ ఉప్పిలి కనకరాజు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్, లీగల్ సెల్ అధ్యక్షుడు యర్రా శ్రీనివాసరావు, సబ్బవరం మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షులు గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, దాసరి సత్తిబాబు, పరవాడ మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పరవాడ వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకుడు పెచ్చేటి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

సర్వర్ మొరాయింపు.. గంటల తరబడి పడిగాపులు

తొలిరోజు రేషన్ దుకాణాల వద్ద కార్డుదారుల పరిస్థితి ఇదే..



సబ్బవరంలోని గంగిరెడ్ల కాలనీలో సర్వర్ మొరాయించడంతో మూసేసిన రేషన్ దుకాణం



వాడచీపురుపల్లిలో సర్వర్ మొరాయించడంతో చెట్ల కింద పడిగాపులు కాస్తున్న వృద్ధులు



చినముషిడివాడలో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల



పెందుర్తిలోని ఓ డిపో వద్ద మహిళల పాట్లు

పెందుర్తి/సబ్బవరం: నియోజకవర్గంలో రేషన్ సరకుల కోసం చౌకధరల డిపోల వద్ద లబ్ధిదారుల కష్టాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. రేషన్ షాపుల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడి, రేషన్ తీసుకోనే పాత పద్ధతికి కూటమి ప్రభుత్వం ఆదివారం అట్టహాసంగా శ్రీకారం చుట్టింది. పలు రేషన్ షాపులను కూటమి నేతలు, అధికారులు ప్రారంభించారు.

- పెందుర్తి మండలంలో చాలా చోట్ల సర్వర్లు మొరాయించాయి. దీంతో కార్డు దారులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఎంతసేపు నిరీక్షించాలో తెలియక, సరకులు ఇస్తారేమోనన్న ఆశతో ఎండలో, ఉక్కబోతలో అలానే ఉన్నారు. వృద్ధులు, మహిళల పరిస్థితి మరీ దారుణం.
- సబ్బవరం మండలంలో 31 రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అయితే రేషన్ షాపులు తెరిచిన కొద్దిసేపటికే సర్వర్ మొరాయించడంతో మండలంలోని పలు రేషన్ దుకాణాలను మూసేశారు. దీంతోపాటు లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించాక నిరాశగా వెనుదిరిగారు. ముందస్తు ప్రణాళికలు లేకుండానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాలను ఒకేసారి తెవరడతో సర్వర్ మొరాయించినట్లు రేషన్ డీలర్లు చెప్పుకొస్తున్నారు. ఆదివారం కావడంతో సమస్య పరిష్కారం కాలేదని సోమవారం యథావిధిగా రేషన్ సరకుల పంపిణీ జరుగుతుందని లబ్ధిదారులకు సర్దిచెప్పడంలో బిజీ అయ్యారు.

పరవాడ: మండలంలో పలు గ్రామాల్లో రేషన్ డిపోలను కూటమి నాయకులు అట్టహాసంగా ప్రారంభించారు. వాడచీపురుపల్లి, కలపాక, పరవాడ రేషన్ డిపోలే కాకుండా అనేక రేషన్ డిపోల్లో సర్వర్లు పనిచేయకపోవడంతో కార్డుదారులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. జగన్ ప్రభుత్వంలో ఇంటికే రేషన్ సరకులు వచ్చేవని, ఇప్పుడు రేషన్ డిపోలకు వచ్చి గంటల తరబడి నిలబడినా, సరకులు అందడం లేదని పలువురు కార్డుదారులు వాపోయారు. ఎండలు మండుతున్న కారణంగా ఆదివారం రేషన్ తీసుకోవడానికి చాలా మంది కార్డుదారులు ముందుకు రాలేదు. రేషన్ డిపోల్లో సర్వర్ డౌన్‌తో వచ్చిన వారు కూడా నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది.

అవస్థలు మళ్లీ మొదలు..



మా రేషన్ డిపోలో సర్వర్ మొరాయించడంతో చాలా ఇబ్బంది పడ్డాం. గంటల తరబడి డిపోల వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. వృద్ధులు నిలబడలేక చెట్ల కింద పడిగాపులు కాశారు. గతంలో వ్యాన్లపై ఇళ్లకు తెచ్చి రేషన్ సరుకులు ఇచ్చేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ నిర్ణయంతో మళ్లీ అవస్థలు పడుతున్నాం.

–పైల అమ్మాజి, వాడచీపురుపల్లి

కానిస్టేబుల్ పరీక్షకు 683 మంది హాజరు



ఆదర్శ్ డిగ్రీ కళాశాల కేంద్రం నుంచి పరీక్ష పత్రాలు తరలిస్తున్న పోలీసులు



పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్షకు హాజరైన అభ్యర్థులను తనిఖీచేస్తున్న పోలీసులు

పెందుర్తి: ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ రాత పరీక్ష ఆదివారం పెందుర్తిలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం రెండు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 752 మందికి గాను 683 మంది హాజరయ్యారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంగా జరిగిన పరీక్షకు 500 మందికి 459 మంది, పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాల కేంద్రంగా జరిగిన పరీక్షకు 252కు 224 మంది పరీక్ష రాశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన పరీక్షకు అభ్యర్థులు గంటన్నర ముందు నుంచే తరలివచ్చారు. కేంద్రాల వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు కావాల్సిన సౌకర్యాలను అధికారులు సమకూర్చారు. పరీక్ష అనంతరం పత్రాలను బందోబస్తు నడుమ పోలీసులు తరలించారు.

ధ్యానంతో ఆరోగ్యం

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం కథలు చదవడం ,రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు నీతి కథలు బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్ నేర్పించారు. పలు ఆటలు ఆడించారు. ధ్యానంపై మెళకువలు నేర్పారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో స్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు ఆదివారం విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉద యం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ముగిసిన కిడ్స్ వర్క్‌షాప్



ధ్యాన కేంద్రంలో వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: పాపయ్యరాజుపాలెంలోని బ్రహ్మర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న కిడ్స్ వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా యోగా గురువులు విజయ, మణి పిల్లలకు మెళకువలు నేర్పించారు. ధ్యాన మాస్టర్లు ధ్యానంపై పలు సూచనలు సలహాలు అందించారు. నిర్వాహకులు, ధ్యాన గురువులు పాల్గొన్నారు.